# పరిశోధకుడు

-తటవర్తి రామచంద్రరావు

ఆ రోజు కూడా మామూలు వేళకి జోగారావు 'డ్యూటీ' ఆరంభమైంది. చాలామందికి ఆఫీసు డ్యూటీ అనో, వ్యాపారమనో ఉంటుంది. కానీ అతని విషయంలో అదొక గొప్ప వ్యాపకం! వెనక కాస్తో కూస్తో ఉంది. ఎక్కడెక్కడో పని చేసుకుంటున్న ఇద్దరు కొడుకులు ఎంతో కొంత పంపుతుంటారు. ఇంక వండి పెట్టటానికి భార్య ఉంది. ఆ వయస్సులో అతను శ్రమ పడాల్సిన అవసరం లేదు.

చాలా రోజులుగా విసుగు విరామం లేకుండా అతను చేస్తున్న పని వీధి అరుగు మీద వాలుకుర్చీలో బైఠాయించటం. 'చదువుకుంటున్నాడ'ని అందరూ అనుకునేలా ఓ పుస్తకం చేత పుచ్చుకుంటాడు.

ఈ మధ్య మూడు నెలలుగా అతని 'డ్యూటీ'లో కొత్త అధ్యాయం ఆరంభమైంది. రోడ్డు మీద నుంచి అతని దృష్టి ఎదురింటి ఎడమవైపు వాటా వైపు తిరిగింది. ఆ ఇంట్లోకి కొత్తగా ఒక నవ దంపతులు చేరారు. అతని పేరు మోహన్... వాళ్లింటాయన చెప్పగా తెలిసింది. ఆ అమ్మాయి పేరు మాత్రం తెలియలేదు. తన భార్య ఒకటి రెండు సార్లు వెళ్లి పలకరించిందని తెలుసు. కానీ పేరడగటానికి సాహసించలేకపోయాడు.

ఆ అమ్మాయి పేరు ఏదయితేనేం లోకంలోని ఎన్ని అందమైన పేర్లున్నా చాలవు అనిపించేంత అందంగా ఉంటుంది. 'మళ్లిపోతున్న తన వయస్సు మరొక్కసారి తిరిగి వస్తే బావుండును' అని అనిపించేంత మనోహరంగా ఉంటుందామె.

ఆ రోజున జోగారావుకి మరీ ఆరాటం ఎక్కువయింది. ఆ నవదంపతులు ఇంట్లో అటూఇటూ తిరిగే హడావిడి చూస్తే ఏదో ప్రయాణ సన్నాహంలా ఉంది. 'అరెరే! ఆ అమ్మాయి ఊరికి గాని వెళ్లిపోతుందేమో' అని తెగ మదనపడిపోయాడు.

మరి కాసేపటికి ఆ ఇంటి తలుపులు తెరుచుకున్నాయి. మోహన్ బయటకి వచ్చాడు. ఆమె గుమ్మంలో నిలబడింది. 'అబ్బ, బట్టలు నలిగినా ఎంత అందంగా ఉంది' అని అనుకున్నాడతను. అతని చూపుల్ని ఢీకొడుతూ మోహన్ దగ్గరకి నడచి వచ్చాడు.

అతని గుండెలు దడదడలాడాయి. కానీ మోహన్ చిరునవ్వు చూసి కుదుటపడ్డాడు.

"ఓ చిన్నమాట చెప్పి పోదామని వచ్చాను."

జోగారావు ఆశ్చర్యంగా చూశాడు. "ఏమిటండీ?"

"నేను అర్జెంటుగా కేంప్ మీద వెళ్లాలి. మా ఇంటి వాళ్లు కూడా ఊళ్లో లేరు. మా ఆవిడ ఒక్కత్తే ఉందని... తానుండగలనంటోంది. అయినా, తెలిసిన వాళ్లకి కొంచెం చెపితే మంచిదని..." మోహన్ కొంచెం సిగ్గుపడుతూ చెప్పాడు.

జోగారావు స్థిమిత పడ్డాడు. ఈమాత్రానికింతగా చెప్పాలా! అమ్మాయికేం కావాలన్నా మేము చూస్తాము. మీరు నిశ్చింతగా వెళ్లి రండి."

"మెనీమెనీ థేంక్స్!" అని చెప్పి మోహన్ వెళ్లిపోయాడు.

మధ్యాహ్నం పోస్టుమేన్ ఓ ఉత్తరాన్ని కిటికీలోంచి గదిలోకి విసిరేశాడు. "తలుపు కొట్టి ఇవ్వకూడదూ! ఆమె కనిపించే మంచి చాన్సు కాస్తా పోయింది." అని పోస్టుమేన్‌ని తిట్టుకున్నాడు జోగారావు.

మోహన్ చెప్పమన్న సంగతి తన భార్యతో చెపుదామని రెండు సార్లనుకున్నాడు. కానీ తన భార్య వెళ్లి కబుర్లలో కూర్చుందంటే ఆ అమ్మాయి అసలు బయటకే రాదేమో అని తమాయించుకున్నాడు. ఆమె ఎంత సేపటికీ బయటకి రాకపోతే ఇక నిగ్రహించుకోలేకపోయాడు. భార్యని పిల్చి "...పాపం, ఆ అమ్మాయి ఒక్కత్తే ఉన్నట్టుంది. కాలక్షేపానికి మనింటికి రమ్మని చెప్పకపోయావా?" అన్నాడు...పుస్తకంలోంచి తల ఎత్తీ ఎత్తకుండా.

"కొత్తేముంది? రోజూ ఒక్కత్తే ఉండటం లేదూ! వయస్సులో ఉన్న పిల్ల. అందులో కొత్తగా పెళ్లయింది. మనలాంటి ముసలాళ్లతో ఏం కాలక్షేపం అవుతుంది?"

తమ ముసలితనం గురించి భార్య గుర్తుచేసే సరికి అతనికొళ్లు మండిపోయింది. "ఇష్టమయితే వస్తుంది. లేకపోతే లేదు. నీకు చెప్పటానికేం?"

"చెప్పానండీ బాబూ! చిన్నపిల్ల కదా! సిగ్గుపడుతోందేమో మరి."

"ఒట్టి అడివి మనిషి" అని భార్య మీద లోలోపల విసుక్కొని మళ్లీ పుస్తకం పుచ్చుకున్నాడు. ఆలోచించగా ఆలోచించగా అతనికో 'ఐడియా' తట్టింది. వెంటనే లోపలకి వెళ్లి తలమీద మిగిలిన నాలుగు వెంట్రుకల్ని మళ్లీ దువ్వుకున్నాడు. చొక్కా మార్చుకున్నాడు. ఠీవీగా నడుచుకుంటూ మోహన్ వాళ్లింటికి వెళ్లి ఉత్సాహంగా తలుపు తట్టాడు.

ఓ నిమిషానికి చేతిలో చదువుతున్న పుస్తకంతో సహా వచ్చిందామె.

"అతను ప్రొద్దున్న వెళ్లేటప్పుడు చెప్పాడు పాపం, ఒక్కత్తివీ ఉన్నావని."

"రండి. రండి"

"నువ్వూ కూర్చో."

"ఫరవాలేదండి."

ఏ ఊరు, తల్లిదండ్రులెవరు, ఏం చదువుకున్నావు వగైరా ప్రశ్నలన్నీ వేశాడు.

మాస్టారు ప్రశ్నలకి స్కూలు పిల్ల జవాబులిచ్చినట్లు వినయంగా చెప్పిందామె.

"అన్నీ అడిగాను...కానీ, అసలు నీ పేరు అడగటం మర్చిపోయా."

"నా పేరు కృష్ణవేణండి!" అందామె చిరునవ్వుతో.

"నీలాగే నీ పేరూ చక్కగా ఉంది!"

ఆమె బుగ్గలు ఎరుపెక్కాయి. "ఇప్పుడే వస్తానండి" అని ఆమె లోపలకి వెళ్లింది.

'చక్కని రూపం. బహుచక్కని పేరు. పరిచయం కూడా అయింది. మోహన్ ఊర్నించి వచ్చినా ఇలాంటి వేళల్లో ఆఫీసులో ఉంటాడు కనుక అప్పుడప్పుడు తను వచ్చి కబుర్లు చెప్పొచ్చు! అమ్మాయి నెమ్మదస్తురాలు. తన చూపులెంత పదునుగా ఉన్నా తన్నింక అనుమానించదు. తనకి రక్షణ...తన వయస్సు!...

అతనింకా ఊహల్లో ఉండగానే కాఫీ కప్పుతో వచ్చిందామె.

"నీకు పుస్తకాలంటే చాలా ఇష్టమనుకుంటాను."

ఆమె నవ్వి ఊరుకుంది.

"మా ఇంట్లో చాలా ఉన్నాయి. కావాలంటే పట్టుకెళ్లొచ్చు."

"అలాగేనండి."

అతను కాఫీ త్రాగటం పూర్తయింది. "నువ్వు కూర్చున్నావే కాదు!"

"బజారుకి వెళ్లాలండి.''
అతనికిక లేవక తప్పలేదు.

***

ఆ మర్నాడు ప్రొద్దున్న జోగారావు 'డ్యూటీ'లో చేరి ఐదు నిమిషాలయిందో లేదో అతనికో వింత దృశ్యం ఎదురైంది. ఎవరో యువకుడు రిక్షా దిగి మోహన్ ఇంటి తలుపుతట్టాడు. కృష్ణవేణి తలుపు తీసింది....

'ఆమె ముఖం పూర్ణచంద్రబింబం'లా వికసించిందని... ఆ యువకుణ్ని చూస్తూనే పరవశంతో త్రుళ్లింతలు పడిందని.. అతని చేతిలోని పేకెట్టుని కాదు...అతని చేతినే అందుకొని లోపలకి తీసుకువెళ్లిందని... అతని కోసమే ఎదురుచూస్తున్న దానిలా కనిపించిందని జోగారావుకి అనిపించింది.

'అతనెవరయి ఉంటాడు?' కాలేజీలో చదివిందిగా! ఇకనేం? బోయ్‌ఫ్రెండ్ అయివుండాలి... అతని గుండెల్లో అసూయ కలుక్కుమంది. 'ఎంత ధైర్యం? అమ్మో! కృష్ణవేణీ! పైకి కనిపిస్తున్నంత అమాయకురాలివి కాదు. అసాధ్యురాలివి. మొగుడు మూడు నాల్గు రోజుల దాకా రాడు. ఈ లోపల ఏం జరిగినా అతనికి తెలియదు. ఇంక ధైర్యం కాక ఏమిటి? బహుశ, భర్త టూరు ప్రోగ్రాము గురించి ముందే తెల్సి ఉంటుంది. 'ఫలానా రోజున మా ఆయన ఊరికి వెళ్లిపోతున్నాడు. మనకి ఎటువంటి ఆటం కాలు లేవు. వెంటనే రా!' అని ఉత్తరం రాసుం టుంది. అది చూసుకొని ఇతను వచ్చే శాడు.

వెంటనే వెళ్లి నిలదీసి అడిగితే? తన చాదస్తం కాని అంతకు తెగిం చిన దానికి మాటకి మాట చెప్పటం తెలియదాయేం? ఇంకా మోహన్ రావ టానికి మూడు రోజులు పడుతుంది. ఇంటివాళ్లు ఊళ్లో లేరు. ఇకనేం? ఆమె దిక ఇష్టారాజ్యం!

జరుగుతున్నదంతా ఊర్నించి రాగానే మోహన్‌కి చెప్పాలి. ఇది తన ధర్మం!... ఇన్నాళ్లకతనో 'మహ త్కార్యం' చేస్తున్నట్టు సంబరపడిపో యాడు... అతనలా ఆలోచనల్లో ఉండగానే ఆ ఇంటి తలుపులు మూసు కున్నాయి. పట్టపగలు! పరాయి వాడితో... ఎంతకు తెగించిందో అని కూడా అనుకున్నాడు.

ఒక గంటకి ఆ తలుపులు తెరుచుకున్నాయి. ఆ యువకుడు నవ్వు వొలకపోస్తూ బయటకి వచ్చాడు. కృష్ణవేణి వయ్యారంగా గుమ్మం పట్టు కొని నిలబడి చిరునవ్వులు చిందిస్తోంది. చక్కని చీర. ఆమె ఒంటిమీదున్న చీరకే అందం వచ్చింది.



'అబ్బ, చేసిన పనిలో ఏమీ తప్పులేదన్నట్టు ఎంత నిశ్చింతగా నవ్వుకుంటున్నారు? ఇద్దరికి ద్దరే!... వయస్సు నాయనా వయస్సు!'... జోగారా వుని ఆలోచనల్లోంచి బయటకి తెచ్చింది అతని గొంతు.

"ఠంచనుగా ఐదింటికి తాజ్‌మహల్ దగ్గరుం టాను. సరేనా!''

'అప్పుడే ఏదో ప్రోగ్రాము కూడా వేసుకు న్నారు వీళ్లు! ఆ మాటల్లో చనువు. ఆ చనువులో గారాబం...పాపం, మోహన్!' అనుకున్నాడు జోగారావు వాలుకు ర్చీలో వెనక్కి వాలుతూ.

***

సరిగ్గా నాలుగున్నరకి కృష్ణ వేణి తలుపులు తెరిచింది. చక్కగా ముస్తాబ యింది.



## బిజీతార

అమాయకంగా కన్పించే ఆమె కళ్ళు ఎన్నో కొత్త సంగతుల్ని చెప్పకనే చెబుతాయి. అగ్రహీరో నాగార్జున సరసన నటించిన తొలి చిత్రం ఆమెకి 'సంతోషం' ఇస్తే ఇప్పుడామె అందరికి ఇష్టమైన తారగా మారిపోయింది. ఆమె శ్రీయ. ఇప్పుడామె మెగాస్టార్ కొత్త చిత్రం 'ఠాగూర్'లో హీరోయిన్‌గా నటిస్తూ సంచలనం రేపుతోంది. చిన్ననాటినుంచి అల్లరి పిల్లగా పెరిగిన శ్రీయ మ్యాథ్స్‌లో ఎక్కువమార్కులు తెచ్చుకున్నందుకు తన తోటి విద్యార్థిని కొట్టిందట. 'నా కళ్ళే నా అందం' అని చెప్పే శ్రీయ 'కళ్లతో చూసి మనసులోని భావాల్ని పసిగట్టేయొచ్చు' అంటోంది. ఆమె కళ్ళు చూస్తే అది నిజమేనేమో అన్పిస్తుంది. టాలీవుడ్‌లో ఇప్పుడామె బిజీ హీరోయిన్.


'లక్కీఫెలోవిరా నాయనా!' అని తెలియని ఆ యువకుడిని మనసులో అసూయగా ఉన్నా అభినందించకుండా ఉండలేకపోయాడు జోగారావు.

కృష్ణవేణి ఓ క్షణం ఇటు చూసింది. చూస్తుందని ఊహించే పుస్తకాన్ని ముఖానికడ్డం పెట్టుకున్నాడతను... ఆమె వెళ్లిపోయిన రెండు మూడు నిమిషాలకి తనూ లేచాడు. భార్యని తలుపేసుకోమని చెప్పి బయలుదేరాడు. ముందు కృష్ణవేణి... వెనక పరిశోధకుడు! మెయిన్ రోడ్డుమీద ఆమె రిక్షా ఎక్కింది. జోగారావు మరో రిక్షాలో వెన్నంటాడు.

తాజ్‌మహల్ దగ్గర వాళ్లిద్దరూ కల్సుకున్నారు. ఎలక్ట్రిక్ స్తంభం చాటు నుంచి ఇదంతా చూస్తూనే ఉన్నాడు జోగారావు. వాళ్లు బయటకి రావటానికి అరగంట పట్టింది. బయటకి వస్తూనే ఓ రిక్షాని పిల్చి ఎక్కారు. మరో రిక్షాలో వాళ్లని ఫాలో అయ్యాడు అతను. అలంకార్ టాకీసు దగ్గర వాళ్ల రిక్షా ఆగింది. టిక్కెట్లు తీసుకొని కృష్ణవేణి అతనితో వెళ్లిపోయింది. కౌంటరు నుంచి వెళ్లేటప్పుడు క్యూలో నుంచున్న జోగారావు పక్కనుంచే వెళ్లింది. తన్ను చూసిందేమోనని అతనికో క్షణం అనిపించింది. 'చూడలేదు కనుకనే అలా హడావిడిగా వెళ్లిపోయింది. తన పిచ్చికాని ఇప్పుడా పిల్లకి పరిసరాలు కనిపిస్తున్నాయా?...'

తీరా అతని ముందు ఇద్దరు ముగ్గురుండగానే 'హౌస్‌ఫుల్' బోర్డు తగిలించారు. అందరితో పాటు అతనికీ ప్రాణం ఉస్సురుమంది. తక్కిన వాళ్లకి సినిమా ఆరాటం కానీ తనకు సినిమా హాల్లోని 'సినిమా' చూడాలన్న ఉబలాటం! అతనేం చేయాలా అని దిక్కులు చూస్తుండగా 'టిక్కెట్టు సార్' అంటూ ఎవరో కుర్రాడు తగిలాడు. మన పరిశోధకుడిలో ఉత్సాహం పుంజుకు వచ్చింది. ఆలస్యం చేస్తే అవకాశం పోతుందని అదనంగా ఆ కుర్రాడి చేతుల్లో నోట్లు కూరి గబుక్కున ఓ టిక్కెట్టు లాగేసుకున్నాడు జోగారావు. ఆ హుషారులో తను ఎక్కువ డబ్బు పెట్టి టిక్కెట్టు కొనాల్సి వచ్చిందే అన్న స్పృహ లేకపోయిందతనికి.

అప్పటికే సినిమా మొదలయింది. ఆ చీకటిలో తనక్కావల్సిన 'హీరో, హీరోయిన్లు' ఎక్కడ కూర్చున్నారో అతనికి తెలియలేదు. అందుకని 'చచ్చినట్టు' తెరమీద సినిమానే అతను చూడాల్సి వచ్చింది. కనబడ్డారు. పదిసార్లయినా వెనక్కి తిరిగి చూశాడు కానీ వాళ్లెక్కడా ఒకళ్లమీద ఒకళ్లు పడిపోవటం లేదు. విరగబడి నవ్వుకోవటం లేదు. ఒబ్బిడిగా కూర్చున్నారు. ఒకటి రెండు మాటలు అంతే! తర్వాత సినిమా చూడ్డంలో మునిగిపోయారు... ఇలా జరగటం జోగారావుకి చాలా నిరుత్సాహమనిపించింది. మొత్తానికతను సరిగా చూడకుండానే సినిమా ముగిసిపోయింది.




అతనిల్లు చేరేసరికి...అప్పటికే కృష్ణవేణి ఇంటి తలుపులు మూసుకుపోయి ఉన్నాయి. పిల్లిలా నడిచి వెళ్లి వాళ్ల మెట్లు మీద రెండుమూడు నిమిషాలు నిలబడి ఆలకించాడు. స్పష్టంగా వినపడలేదు కానీ వాళ్లేదో నవ్వుకుంటూ మాట్లాడుకుంటున్నారని మాత్రం అర్థమయింది. 'ఇది సినిమా హాలు కాదుగా! తలుపులు మూసుకున్నారు. ఏం చేసినా చేయొచ్చు. తెగించారు! పూర్తిగా తెగించారు!' అనుకున్నాడు.

***

'మోహన్ కేంపు వెళ్లాక అది మూడోరోజు. అంటే రేపో ఎల్లుండో వస్తాడు. కృష్ణవేణికి ఈ రోజంతా విచ్చలవిడిగా తిరగటానికి ఛాన్సుంది. ఏం చేస్తుందో చూడాలి' అనుకుంటూ ప్రొద్దునే తన 'డ్యూటీ'లో చేరిపోయాడు జోగారావు. 'కృష్ణవేణి' ఇంటి తలుపులు ఎంతసేపటికీ తెరుచుకోలేదు. 'పాపం, రాత్రంతా నిద్రపోయుండరు! ఒక పట్టాన మెలకువ వస్తుందా!' అనుకున్నాడు వ్యంగ్యంగా.

ఎనిమిది దాటాక ఆ ఇంటి తలుపులు తెరచుకోవటంతో అతని దృష్టి ఆలోచనలు మళ్లీ అటు తిరిగాయి. 'హీరోయిన్' ఇంకా నలిగిన బట్టల్లో బద్ధకంగా మరింత అందాలొలికిస్తూ నిలబడింది. 'హీరో' మాత్రం టిప్‌టాప్‌గా తయారయ్యాడు.

"రాత్రికి వంటా అదీ పెట్టకు. హోటల్లో తిందాం. నే వచ్చి తీసుకువెడతా!" అని చెప్పి వెళ్లిపోయాడతను.

'అడిగే వాడు లేకపోతే నీకేం నాయనా, ఎంత ధీమాగానేనా వెడతావ్' అనుకున్నాడు జోగారావు.

కృష్ణవేణి అతనివైపోసారి చూసి తలుపులు వేసుకుంది. 'ఎంత నిర్భయం! ఎక్కడా జంకూ గొంకూ లేవు. దేవాంతకురాలు!' అనుకున్నాడు అతను. పక్కింటి ముసలమ్మతో గంటల తరబడి కబుర్లు పెట్టుక్కూర్చుంటుంది కాని...ఎదురింటి 'పడుచుపిల్ల'ని పలకరించటానికి ఉత్సాహం చూపించదు తన భార్య! అసలామె వెళ్లొస్తే కొంత తీగలాగి ఉండేది. తను డొంకంతా కదిలించుండేవాడు. 'ప్చ్!' అని నిట్టూర్చాడు.

"ఏమండోయ్!" అని భార్య లోపల్నించి పిలిచేసరికి అతని ఆలోచనలు తెగిపోయాయి. మంచంమీద పడుకున్న భార్యని చూసి ఆశ్చర్యపోయాడు. "ఏమయింది?"

"ఎలాగో వంట చేశా. పెట్టే ఓపిక లేదు. కొంచెం

పెట్టుకు తింటారా?''

అతనికి ప్రాణం ఉసురుమంది. "అలాగే కాని...ఏమిటలా ఉన్నావు?''

"కొంచెం జ్వరం తగిలినట్టుంది.''

అప్పుడతను భార్య మందు గురించి ఆలోచించలేదు. కృష్ణవేణి దగ్గరికి ఆమెను పంపే అవకాశం పోయిందన్న నిరుత్సాహం కలిగింది. "ఇంతసేపూ చెప్పలేదేం?'' అని దాదాపు విసుక్కున్నాడు.

"నాకిప్పుడేమీ మందులూ డాక్టర్లు వద్దు లెండి. ఈ పూట లంఖణం చేస్తాను. రేపటికదే తగ్గిపోతుంది.''

***

'ఇంకా ఈ రోజంతా గడవాలి! సాయంత్రం వాళ్లెక్కడెక్కడ తిరుగుతారో వెంటాడి చూద్దామంటే....భార్య మూలుగుతో మంచమెక్కింది.' అని కొంత నిరుత్సాహమైంది జోగారావుకి.

'ఎంత పాత ప్రేమికులయినా బయట ఏం చేయరుకదా! ఏం చేసినా ఇంటికి వచ్చాక...రాత్రి తలుపులు వేసుకున్నాక...అప్పుడు! ఆ ఇంటి వాటా సంగతి తనకు పూర్తిగా తెలుసు. ఎడమ వైపు సందులోంచి వెళ్లి రెండో కిటికీ దగ్గర నిలబడితే పడగ్గది కనిపిస్తుంది!...'

కృష్ణవేణి ఇంటి తలుపులు తీసిన చప్పుడయి ఉలిక్కి పడ్డాడు. ఆమె వైపు చూశాడు. ఆమె కూడా అతనివైపు చూసింది. రెండు మూడు క్షణాలకన్నా దీర్ఘంగా చూడలేకపోయాడు. ఆమె తనవైపు చూస్తుండగా ఆమెను పరిశీలించటమెలాగో అతనికి తెలియలేదు. చటుక్కున ముఖానికడ్డంగా పుస్తకాన్ని పెట్టుకొని వ్రేళ్ల సందుల్లోంచి చూస్తూ కూర్చున్నాడు. ఆమె ఒకటి రెండు నిమిషాలు అటూ ఇటూ చూస్తూ నిలబడింది. ఎక్కువసేపుఅతని వైపే చూసింది. '...ఏమిటి చెప్మా? ఇంటికి వచ్చి ఏమైనా చెప్పాలనుకుంటోందా? లేక పుస్తకాలు కావాలని అడగాలనుకుంటుందా?' అతనింకా అటోఇటో తేల్చుకోకుండానే లోపలకి వెళ్లి తలుపులు వేసుకుందామె.

తనేదో భ్రమపడ్డాడు కానీ ఆమెకిప్పుడు తనతో ఏం చెప్పాలని అనుకుంటుంది? గత రాత్రి పొందిన తియ్యని అనుభవాల మీదో, రానున్న రాత్రిని ఎలా మధురం చేసుకోవాలన్న ఆలోచనలతోనో గడుపుతూంటుంది!... ఒకసారి వెళ్లి చూస్తే? అలా అనుకున్నదే తడవు అతని కోరిక క్షణాలమీద బలపడిపోయింది. లోపలకి వెళ్లి చొక్కా వేసుకున్నాడు. బయటకి వెళ్లబోతుంటే "ఏమండీ!'' అంటూ భార్య పిలిచింది.

"ఏం కావాలి?'' విసుగుదలని కప్పి పుచ్చుకుంటూ అడిగాడు.

"కొంచెం కాఫీ పెడతారా? డికాషన్ ఉంది.''

జవాబు చెప్పకుండా పెద్దపెద్ద అంగలు వేస్తూ వంటింట్లోకి వెళ్లాడు. కాఫీ కలిపి భార్యకిచ్చేసరికి పావుగంట పట్టింది.

అతను ఎంత వేగంగా వచ్చాడంటే...తలుపు తట్టటానికి చెయ్యెత్తే వరకు వేళాడుతున్న తాళం కప్ప కనిపించలేదు. నిర్ఘాంతపోయాడు. '...అప్పుడే అతను రావటం ఆమెని తీసుకువెళ్లిపోవటం జరిగిందా!' నిరుత్సాహంతో నీర్సంగా అడుగులు వేస్తూ వెనక్కి వచ్చాడు.' 'ఎంత పనిచేశారు?' అనుకున్నాడు దుగ్ధగా.

మరో గంటకి ఇంటి ముందు రిక్షా ఆగింది. పరీక్షగా చూశాడు. మోహన్! నాలుగు రోజులు కేంపు. అతను మర్నాడు రావల్సింది. అప్పుడే ఎలా వచ్చాడు? భార్యని...ఇలా హఠాత్తుగా వచ్చి పరీక్షిద్దామనా?...జోగారావు ఆలోచనలింకా పూర్తి కాలేదు...అతను మెట్లెక్కి వచ్చాడు.

"రండి రండి. మంచినీళ్లు కావాలా?''

"వద్దండీ!''

"మీరు రేపు వస్తారని కదూ చెప్పారు?''

మోహన్ నవ్వాడు. "పనయిపోయిందండి. వచ్చేశాను''

"అమ్మాయి తాళం చెవి ఏదీ ఇవ్వ లేదండీ!''

"అహ! తాళం చెవి కోసం కాదు ఎక్కడికి వెళ్లిందో మీగ్గాని తెల్సునా?''

"ఎక్కడికి వెళ్లిందో తెలియదు కానీ ఎప్పుడు వెళ్లిందో మాత్రం చెప్పగలను.''

మోహన్ చిత్రంగా చూశాడు. "ఎప్పుడు వెళ్లింది?''

"ఐదున్నరకి.''

"ఆశ్చర్యంగా ఉందే? ఇంతసేపు ఎక్కడికి వెళ్లినట్లు?''

"సారీ అండీ! మా ఆవిడకి ఒంట్లో బాగోలేదు. మీకు కాఫీ అదీ...''

"అబ్బే వద్దండీ! నేను స్టేషనులో తాగి వచ్చాను.''

"...అలా వీధి చివరి దాకా వెళ్లొద్దాం రండి.'' అన్నాడు జోగారావు.

"ఏ క్షణాన్నయినా కృష్ణ వస్తుందేమో!'' అన్నాడు మోహన్ సిగ్గుపడుతూ.

"మీ కృష్ణ ఒంటరిగా వెళ్లలేదు. ఎవరో ఒకతను వెంట ఉన్నాడు.''

మోహన్ తెల్లబోయాడు.

"రండి. మీతో చాలా విషయాలు చెప్పాలి. మీకు తెలియనివి నాకు తెలుసు.''

వీధి చివరకు

## మధురం మధురం ఈ ప్రణయం


మనసులు కలవాలేగానీ మనువుతో సంబంధం ఏముంది? పెళ్లి కాకపోయినా ప్రేమించుకుని 77 ఏళ్ళు కలిసి ఉన్నారు. 95 సంవత్సరాల ఆ తాత, 94 సంవత్సరాల ఆ అవ్వ ఏప్రిల్ 2న చట్టప్రకారం పెళ్లి చేసుకుని ఒకటయ్యారు. తాళి అనే బంధంలో వున్న గొప్పతనం ఏమిటో తెలుసుకోవాలని వీరికి ఈ చివరి మజిలీలో అనిపించిందిట. మనవలు, మనవరాళ్ళ మధ్య అధికారుల సాక్షిగా దంపతులయ్యారు. బుగ్గలు సొట్ట పడితేనేం, ముద్దులు మాత్రం మధురంగానే ఉన్నాయంటూ అందరి ఎదురుగానే ముద్దులు కురిపించుకున్నారు.

## సైకిల్‌పై షికారు

కరవుకాలంలో ఇతర ప్రాంతాలకి వలస పోవడం మనందరికీ తెలిసిందే. సైకిల్‌పై విదేశాలు సైతం వలస వెళ్లడం వింతేకదా. అర్జెంటీనాలో ఓ కుటుంబం ఆర్థిక సంక్షోభంలో పడింది. వేరే దిక్కులేక చిలీ, పెరూ దాటి ఈ కుటుంబం కొలంబియా చేరుకున్నారు. అదీ ఎలా అనుకున్నారు? సైకిల్‌మీద ప్రయాణించి. పధ్నాలుగు నెలలుగా వీరి సైకిల్‌పై ప్రయాణం కొనసాగుతూనే వుంది. ఎప్పటికైనా అమెరికా కూడా వెళ్లాలన్నది వారి ధ్యేయం. త్వరలో మెక్సికో, కెనడా కూడా వెళ్లాలని ఉందిట. వారి సైకిల్ యాత్ర సక్సెస్ అవ్వాలని మనమూ కోరుకుందాం.

-శశి





## కరిష్మా పట్టుదల

పట్టుదల ఉంటే సాధించలేనిది లేదు. కోర్టు గొడవలు ముగిసిన తరువాత 'కరిష్మా-ది మిరాకిల్స్ ఆఫ్ డెస్టినీ' సీరియల్‌తో జనం ముందుకి వచ్చిన కరిష్మాకి ఇప్పుడు క్షణం కూడా తీరికలేదంటోంది. పబ్లిసిటీ విషయంలో కూడా చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్న కరిష్మా బాలీవుడ్‌లో వరుస ఆఫర్లతో ఉక్కిరిబిక్కిరి అవుతోంది. ఒక పక్క సీరియల్ షూటింగ్ కోసం తిరుగుతున్న కరిష్మా, ఇప్పుడు 'మేరా జీవన్ సాథీ' చిత్రంలో నటిస్తోంది. ఇకనుంచి తాను చక్కటి ప్రణాళికతో కెరీర్‌ని కొనసాగిస్తానని చెబుతున్న కరిష్మాలో ఒకరకమైన కసి కన్పిస్తోంది. ఏదో సాధించాలన్న పట్టుదలతో ఆమె విజయ పథం వైపు సాగుతోంది.

చేరే వరకు ఎవరూ మాట్లాడలేదు.

"అతనెవరో మీకు తెలుసా?"

"తెలియదు. మీక్కూడా తెలుసుంటుందని అనుకోను."

"కృష్ణని అడగక పోయారా మీరు?"

"ఆ అమ్మాయికి నాతో మాట్లాడే తీరిక ఎక్కడుంది? అతనితోనే సరిపోయింది."

మోహన్ ముఖం ఎర్రనయింది. స్ట్రీటు లాంపు వెలుగులో అతన్నే పరీక్షగా చూశాడు జోగారావు. "పెళ్లికి ముందు మీ భార్య గురించి మీరు బాగా తెల్సుకోలేదనుకుంటా!"

మోహన్ మాట్లాడలేదు.

"మిమ్మల్ని వాళ్లు మోసం చేశారు."

"ఆ మాటలటుంచి మీకు తెలిసింది చెప్పండి." అన్నాడతను చిరాగ్గా.

"ఏం చెప్పమంటారు? ఏం చెప్పటానికీ నోర్రావటం లేదు."

"ఫర్వాలేదు. మీకేం తెలుసో చెప్పండి."

"అతనికీ ఆమెకీ ఏ కాలేజీ నాటి నుంచో సంబంధం ఉండుంటుంది. లేకపోతే, అంత ఇదిగా...

"ప్లీజ్! మీ ఊహ కాదు నాక్కావల్సింది నిజం. ఏం చూశారో చెప్పండి. అది చాలు!"

"నిన్న పొద్దున్న వచ్చాడు. బంధువేమో అనుకున్నా మొదట. చేతిలో చిన్న పేకెట్టు తప్ప మరేం లేదు. నా అనుమానం అతనే హోటల్లోనో సామాను పెట్టి వచ్చాడు."

అతని మాటల్లోని వ్యంగ్యం మోహన్‌కి చురకలా తగిలింది. "సరే, తర్వాత?"

"ఓ గంటపైనే తలుపులు వేసుకున్నారు."

మోహన్ ముఖం నల్లబడిపోయింది. "చెప్పండి" అతని కంఠం వణికింది.

"వాళ్ల మాటలు నాకు బాగానే వినిపించాయి. సాయంత్రం తాజ్‌మహల్‌కి వెళ్లారు. తర్వాత సినిమా. రాత్రి ఇంట్లోనే గడిపారు."

మోహన్ నిస్త్రాణ పడిపోయాడు.

"మీకిలా అన్యాయం జరుగుతుందని తెలిశాక నాకు చాలా బాధనిపించింది సుమాండీ! అందుకనే, నిజం తెల్సుకుందామని వాళ్ల వెనకనే వెళ్లి కళ్లారా చూశాను."

మోహన్‌కి ఉక్రోషంతో కళ్ల నీళ్లు తిరిగాయి.

"పాపం, మీకు పెళ్లయి మూడు నెలలేగా అయింది. ఇంతలోనే ఇంతకు తెగించిందంటే బాధగానే ఉంటుంది మరి!"

మోహన్ మాట్లాడకుండా వెనుదిరిగాడు...జోగారావుకిప్పుడు పరమ సంతోషంగా ఉంది. మోహన్‌కి సాయం చేసి తన 'ధర్మం' నిర్వర్తించుకున్నం దుక్కాదు. కృష్ణవేణికి ఆమె ప్రియుడికీ మరికాసేపట్లో జరగబోయే పరాభవం చూసి కన్నుల విందు చేసుకునేటందుకు! దీనికంతకీ తన పరిశోధనే కారణం!... ఆ క్షణంలో మోహన్ మనస్సులో ఎన్ని అగ్ని గోళాలు బద్దలవుతున్నాయో అతనికేమీ పట్టలేదు.

అతని వెంట నెమ్మదిగా మెట్లెక్కి వచ్చాడు మోహన్. కుర్చీ వేశాడు జోగారావు.

"మీకభ్యంతరం లేకపోతే లైటు తీసేయండి."

"మంచి ఆలోచన. మనం చీకట్లో ఉంటేనే వాళ్లని కనిపెట్టవచ్చు." అని లైటు ఆర్పేశాడు జోగారావు. మోహన్ ఏమైనా అంటాడేమోనని కాసేపు ఎదురుచూశాడు.

"...ఈ మూడు నెలలూ మిమ్మల్ని చూసిన వాళ్లు మీరిద్దరూ ఎంతో అన్యోన్యంగా గడుపుతున్నారనుకుంటారు. అందరిలాగే ఈడూజోడూ కుదిరిందని నేనూ ముచ్చటపడ్డాను. కానీ అమ్మాయి ఇలా చేస్తుందని పాపం...మీరూ అనుకోలేదు. నేనూ అనుకోలేదు..."

"ప్లీజ్! నా మానాన నన్నుండనివ్వండి".

జోగారావుకి కోపం వచ్చి ముఖం ముడుచుకున్నాడు.

మరికాసేపటికి రిక్షాలో వాళ్లిద్దరూ దిగారు.

"ఇక చూడండి." అని వ్యంగ్యంగా హెచ్చరించాడు జోగారావు.

ఉద్వేగంతో మోహన్ పైకి లేచాడు.

"కాసేపు ఆగి చూడండి. మీకే తెలుస్తుంది."

అప్రయత్నంగా నిలబడిపోయాడు మోహన్.

కృష్ణవేణి తలుపులు తీసి లైటు వేసింది. లైటు వెలుగులో పర్సు తెరచి డబ్బులు చూసి రిక్షా వాడికిచ్చింది. అతను ఏవో పేకెట్లతో ఆమె వెనకనే ఇంట్లో అడుగు పెట్టాడు. రెండు నిమిషాలాగి మోహన్ వాళ్లింటి వైపు నడిచాడు.

'మీరు కూడా రండి.' అని అతను పిలుస్తాడేమోనని ఎదురుచూశాడు జోగారావు. కనీసం థేంక్స్ యినా చెప్పలేదు. అతనక్కడ ఉన్న విషయమే పట్టనట్టు తన సూటుకేసుతో విసవిసా మెట్లు దిగి వెళ్లిపోయాడు మోహన్.

"నేనూ వస్తున్నానుండండి..." ఈ విషయంలో తనక్కూడా హక్కు ఉన్నంత చొరవతో వెంటపడ్డాడు జోగారావు.

మోహన్ తలుపు తట్టినప్పుడు గడియ తీసింది ఆమె కాదు. అతను! వెనకున్న జోగారావుకి 'అతని' ముఖం సరిగా కనిపించలేదు. మోహన్ అడ్డంగా ఉన్నాడు.

'అతని' లెంపలు పేలటం లాంటి చప్పుడు విని



పించలేదు ఊపిరి బిగపట్టిన జోగారావుకి. మోహన్ స్థాణువులా నిలబడిపోయాడు. ఆశ్చర్యం!

"ఓ కృష్ణా! ఎవరొచ్చారో చూడు" అని అతను పెద్దగా కేక పెట్టాడు.

'బావుంది. ఘనంగా ఉంది. ఆ కృష్ణ మొగుడే ఎదురుగా ఉన్నాడని తెలుసుంటే నువ్వింత నిర్భయంగా నిలబడి మాట్లాడగలవా నాయనా!' అనుకున్నాడు జోగారావు.

మోహన్ వెనక్కి తిరిగాడు. జోగారావు వైపు చూశాడు. ఆ మసక వెలుగులో మోహన్ ముఖ కవళికలు చాలా చిత్రమనిపించాయి జోగారావుకి. ఎందుకో అతనికర్థం కాలేదు.

"అరే, వచ్చేశారా!" అంటూ వచ్చింది కృష్ణవేణి.

మోహన్ మాట్లాడలేదు. తనవైపు అతనెందుకలా చూస్తున్నాడో జోగారావుకి అంతుపట్టకుండా ఉంది.

"అక్కడే నిలబడి పోయారేమిటి? రండి రండి... రండి బాబాయిగారూ!" అని చిరునవ్వు నవ్వింది కృష్ణవేణి.

తను ఊహించిన మోహన్ కేకలు, వాళ్ల మధ్య రభస, కృష్ణవేణి భయంతో వణికిపోవటం అలాంటి వాటి కోసం ఎదురుచూసిన జోగారావుకి 'అతని' ముఖం మీద చిరునవ్వు. ఆమె నిలువునా ఆనందం, మోహన్‌లో నిశ్చలత ఎదురైనాయి.

తలతిప్పుకొని నెమ్మదిగా లోపలకి నడిచాడు మోహన్. "రండిసార్!" అని తనెవరో తెలియని అతను మరో అడుగు ముందుకు వేసి మరీ పిలిచాడు. జోగారావుకిక మెట్లెక్కి వెళ్లక తప్పలేదు. అతనికంతా అయోమయంగా ఉంది. 'భయపడతారనుకున్న వాళ్లు నిర్భయంగా ఉన్నారు. భయపెడతాడనుకున్న వాడు ప్రశాంతంగా కూర్చున్నాడు. ఏమిటిదంతా? 'ఎవరొచ్చారో చూడు?' అన్నది పరిహాసానికా? అంటే, అతనెవరో మోహన్‌కి తెలుసన్నమాట! నిస్సత్తువ క్రమ్మి 'అతను' కూర్చోమనగానే చటుక్కున కూర్చున్నాడు.

మంచినీళ్లు తెచ్చిచ్చింది కృష్ణవేణి. ఆమె చేతిలోని గ్లాసందుకొని 'అతను' జోగారావుకిచ్చాడు.

"మంచినీళ్లివిగో! ఏమిటలా ఉన్నారు?" అంటూ భర్త దగ్గరకి వెళ్లింది ఆమె.

మోహన్ కళ్లు జ్యోతుల్లా ఉన్నాయి. ఒక్కక్షణం ఆమెవైపు చూశాడు. మరోక్షణం అతనివైపు చూశాడు. తరువాత జోగారావు వైపు చూశాడు. మోహన్ చూపులు తనకు సూదుల్లా గ్రుచ్చుకున్నట్లనిపించింది. గ్లాసందుకొని కంగారుగా నీళ్లు తాగేశాడు. అతనికి మెదడు మొద్దుబారినట్లయిపోయింది.

"ఇద్దరూ అలాగే ఉన్నారు. ఏదో అయింది." కృష్ణవేణి కంఠం వణికింది.

మోహన్ ఆమె వైపో క్షణం చూశాడు.

"మాట్లాడరేమిటి? నాకేదో భయంగా ఉంది." అంటూ భర్తభుజం మీద చేయి వేసి ఊపిందామె.

మోహన్ కళ్లు ఆర్ద్రత చెందాయి. "మీ అన్నయ్య వచ్చినట్టు బాబాయి గారింట్లో చెప్పకపోయావా?"

"...ఏదీ అన్నయ్య కేంప్ మీద వచ్చాట్ట! సామానూ అదీ ఇన్‌స్పెక్షన్ బంగళాలో పడేసి ఉత్త చేతులతో వచ్చాడు. నిన్న రాత్రి ఇక్కడుండటమే బ్రహ్మాండమైపోయింది. రేపు తెల్లవారే వెళ్లిపోవాలిట. మిమ్మల్ని చూడకుండా వెళ్లిపోవాల్సి వస్తుందేమోనని బాధపడుతున్నాడు. అన్నయ్య వచ్చిన సంగతి చెపుదామనుకున్నాను, నిన్నా , ఈ వేళా పిన్నిగారు కనిపించలేదు. రెండు మూడు సార్లు బయటకి చూస్తే బాబాయిగారు పుస్తకం చదువుకుంటూ కనిపించారు. ఆయన్ని డిస్టర్బ్ చేయాలనిపించలేదు..."

"...ఆవిడకి ఒంట్లో బాగాలేదుట." అన్నాడు మోహన్.

"అయ్యో! నాకు తెలీదండీ! తెలిస్తే వెళ్లి చూసి వచ్చేదాన్ని." అంది ఆమె నొచ్చుకుంటూ.

మోహన్ చూపుల్లోని తీక్షణత తట్టుకోలేనంత ఉధృతంగా ఉంది. మోహన్ పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ తన దగ్గరకి వస్తున్నట్టు, తనని చితకబాదటానికి సన్నద్ధమవుతున్నట్టు జోగారావుకనిపించింది. ముచ్చెమటలు పోశాయి. చెవులు గళ్లడిపోయాయి. కళ్లు చీకట్లు క్రమ్మాయి. అంతుపట్టని భయంతో ప్రాణాలు కడట్టి నట్టయింది...

"ఏమండీ! ఏమండీ!" ముఖంమీద నీళ్ల చినుకుల స్పర్శకి అతికష్టం మీద స్పృహలోకి వచ్చాడు. కృష్ణవేణి అన్నయ్య తననే ఆత్రుతగా చూస్తున్నాడు. "ఏమిటలా అయిపోయారు?"

జోగారావు పెదవులు కదిలాయి కానీ మాట రాలేదు.

"కొంచెం ఆయన్ను ఇంటిదాకా దిగపెట్టి రాగలరా బావగారూ!" అన్నాడు మోహన్. ఇప్పుడతని గొంతులో క్రొత్త ఉత్సాహం తొణికిసలాడింది. ముఖం తేటగా ఉంది.

తనంతట తను లోపలకి నడచి వచ్చిన 'బాబాయిగారు' తర్వాత ఎందుకిలా స్పృహ తప్పిపోయాడో అర్థం కాక ఆశ్చర్యంగా చూసింది కృష్ణవేణి.

"పాపం, పెద్దవయస్సు..." అన్నాడామె అన్నయ్య సానుభూతిగా... జోగారావుని రెక్కపట్టుకొని కుర్చీలోంచి లేవదీస్తూ.

★

# పూజ

''ఏంట్రా! ఈమధ్య పుస్తకాలు తీసి చదవడమే లేదు'' కోపంగా అడిగాడు తండ్రి.

''వినాయకునికి పూజ చేస్తే చదువు బాగా వస్తుందని చెప్పావుగా. మరి మొన్న పూజ చేశానుగా. అందుకే చదవడంలేదు'' నింపాదిగా చెప్పాడు కొడుకు.

–ఎస్.కె.దుర్గ (క్యాతూరు)

# అన్నప్పుడు...

''నాకు జీవితంలో ఒకే ఒక్కసారి అనిర్వచనీయమైన ఆనందం కలిగింది గురూ'' గోపాలరావుతో చెప్పాడు భజగోవిందం.

''ఎప్పుడు?'' అడిగాడు గోపాలరావు.

''చాల్లే నోర్మూయ్. నాకుగాని తిక్కరేగిందంటే నిన్నేం చేస్తానో నాకే తెలీదు అని నా భార్యతో అన్నప్పుడు.''

''అంతమాట నిజంగా అనగలిగావా?''

''ఎబ్బే...కలలో'' బిడియంగా చెప్పాడు భజగోవిందం.

# మనస్తత్వం

''అదేంటీ నాకొచ్చిన కవర్ని ఏడుస్తూ ఇస్తున్నావ్?'' రచయిత రాసేరావ్ ఆశ్చర్యంగా అడిగాడు పోస్ట్‌మేన్‌ని.

''ఇది తిరిగొచ్చిన కథ. నాది ఎదుటివాళ్ళ బాధని నా బాధగా భావించే మనస్తత్వం లెండి'' కన్నీళ్ళు తుడుచుకుంటూ చెప్పాడు పోస్ట్‌మేన్.

–భానుకిరణ్
(సీతాఫల్‌మండి)

